నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 28 మే 2024 | NIZAMABAD

# కాటేసిన కరెంట్


- విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం
- కరెంటు షాక్‌తో యువకుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ జయేశ్ రెడ్డి, ఎస్సై అప్పారావు

రుద్రూర్, మే 27: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి ఓ యువకుడు కరెంట్ షాక్‌తో మృతి చెందిన ఘటన రుద్రూర్ మండలం రాయకూర్ క్యాంపు గ్రామంలో చోటు చేసుకున్నది. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం వీచిన ఈదురుగాలులకు రాయకూర్ క్యాంపు శివారులో చెట్లు మీదపడి విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. సోమవారం ఉదయం అదే గ్రామానికి చెందిన షేక్ లతీఫ్(29) ఉపాధి హామీ పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో కింద పడి ఉన్న విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న గ్రామస్తులు.. పోలీసులు, సంబంధిత శాఖ అధికారులకు సమాచారం అందించగా మృతదేహాన్ని పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకొని విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే యువకుడు చనిపోయాడని, విద్యుత్ స్తంభం విరిగి కిందపడిందని అధికారులకు సమాచారం ఇచ్చినా విద్యుత్ సరఫరా ఎలా చేస్తారని ప్రశ్నించారు. మృతుడి కుటుంబానికి నష్టపరిహారం చెల్లించే వరకు మృతదేహాన్ని కదిలించేది లేదని భీష్మించుకూర్చున్నారు. దీంతో విద్యుత్ శాఖ ఏడీ రవికుమార్, సీఐ జయేశ్‌రెడ్డి గ్రామస్తులను సముదాయించారు. సంబంధిత శాఖ నుంచి ఎక్స్‌గ్రేషియా వస్తుందని, అందుకు తాము పూర్తిగా సహకరిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడికి తల్లిదండ్రులు, ఇద్దరు అక్కలు ఉన్నారు. తండ్రి షబ్బీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై అప్పారావు తెలిపారు.

కార్పొరేట్, ఇంటర్నేషనల్ పేరిట ప్రచారం



**మరో నాలుగైదు రోజుల్లో** ఇంటర్, 15రోజుల్లో పాఠశాలల తరగతులు ప్రారంభంకానున్నాయి. దీంతో ధనార్జనే ధ్యేయంగా నెలకొల్పిన పలు విద్యాసంస్థల యాజమాన్యాలు వసూళ్ల దందా మొదలుపెట్టాయి. అనుమతులు లేకపోయినా కార్పొరేట్, ఇంటర్నేషనల్ పేరిట తల్లిదండ్రులను బుట్టలో వేసుకుంటున్నాయి. అడ్మిషన్ల పేరుతో రూ.లక్షల్లో ఫీజులను వసూలు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

– ఖలీల్‌వాడి, మే 27

# విద్య దందా ఘరూ


- రంగంలోకి దిగిన విద్యాసంస్థలు
- తల్లిదండ్రులను మోసం చేస్తున్న స్కూళ్లు, కాలేజీలు
- అనుమతులు లేకుండానే అడ్మిషన్ల ప్రక్రియ మొదలు
- రూ.లక్షల్లో ఫీజుల వసూళ్లు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



జూన్ నెల వస్తున్నది. పాఠశాల, కళాశాలల తరగతులు ప్రారంభంకానున్నాయి. తమ పిల్లలకు మంచి విద్యను అందించాలనే ఉద్దేశంతో ఏ పాఠశాల, కళాశాలలో చేర్పిస్తే బాగుంటుందోనని తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు. ఇదే సమయంలో కొన్ని విద్యాసంస్థలు వ్యాపార ప్రయోజనాలే ధ్యేయంగా అడ్డదార్లు తొక్కుతున్నాయి. ర్యాంకులు, మార్కులు చూపుతూ అడ్మిషన్లను ప్రారంభించాయి. తల్లిదండ్రులను ప్రలోభాలకు గురిచేస్తున్నాయి. మరికొన్ని అయితే తమ పాఠశాల, కళాశాలలో అడ్మిషన్లు అయిపోతున్నాయని, సీట్లు తక్కువగా ఉన్నాయని ప్రచారం చేస్తున్నాయి. మంచి కళాశాల, పాఠశాలల్లో వేయాలని చూస్తున్న వారికి కొన్ని కార్పొరేట్ సంస్థల పేరిట బురిడీ కొడుతున్నారు. అంతేకాదు ఇంటర్నేషన్ స్కూల్ అంటూ ప్రచారాలు చేసి తల్లిదండ్రులని తమవైపు మలుచుకుంటున్నారు. నిజామాబాద్ నగరంలో కొంత మంది అనుమతులు రాకపోయినా కార్పొరేట్ కళాశాలల పేరిట అడ్మిషన్లు మొదలుపెట్టారు. ఇప్పటికే 144 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నట్లు సమాచారం. ఉన్న కళాశాలకే దిక్కులేంటే మరో కళాశాల పేరుతో నడుపుతున్నారు. ఇంత జరుగుతున్నా ఇంటర్ విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. తోక పేర్లను చూసి తల్లిదండ్రులు రూ.లక్షలు పెడుతున్న విషయం తెలిసినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు న్నాయి. నామమాత్రంగా అనుమతులు లేని విద్యాసంస్థల్లో పిల్లలను చేర్పించొద్దంటూ ప్రెస్ నోట్ రిలీజ్ చేసి మమ అంటున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విషయం తెలిసి మొదట్లో పలు విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేసి వదిలేశాయి. దీంతో ఆ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు మళ్లీ కొనసాగుతున్నాయి.

**ప్రచారం కనిపించడం లేదా?**

కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూళ్లు, కళాశాల తమదేనంటూ వివిధ మాధ్యమాల్లో యాజమాన్యాలు ప్రచారం చేస్తున్నాయి. లక్షలు పెట్టి హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, గోడ, కరపత్రాలు పంచుతున్నా ఇవేమీ సంబంధిత శాఖ అధికారుల దృష్టికి వెళ్లడం లేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పాఠశాల, కళాశాలలు స్థాపించాలంటే తప్పకుండా తమ అనుమతి ఉండాలని చెబుతున్న అధికారులే కిమ్మనకుండా ఉండడంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అడ్డదారులు తొక్కుతున్న కార్పొరేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.




**పాఠశాలల్లోనూ ఇదే తంతు..**

జిల్లాలో కొంతమంది టెక్నో, ఇంటర్నేషన్ల పేరిట పలు పాఠశాలలను స్థాపించారు. వాటికి అనుమతులు ఉన్నాయా? ఇంటర్నేషనల్ పాఠశాలలకు ఉండాల్సిన నిబంధనలు పాటిస్తున్నారా? అనే విషయమై విద్యాశాఖ అధికారులకు పట్టింపు కరువైందనే ఆరోపణలు వస్తున్నాయి. తోక పేర్లతో అడ్మిషన్లు చేపడుతూ ఫీజులు రూ.లక్షల్లో వసూలు చేస్తున్నా అధికారులు నోరు మెదపకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. కార్పొరేట్ యాజమాన్యాలు సంబంధిత శాఖ అధికారులకు ముడుపులు సమర్పించుకోవడంతోనే పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

**అనుమతుల విషయం తెలుసుకోవాలి..**



పిల్లలను చేర్పించే ముందుగానే సంబంధిత పాఠశాలకు అనుమతి ఉందో.. లేదో మండల విద్యాశాఖ అధికారిని అడిగి తెలుసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలలని మూసివేసేందుకు అధికారులకు ఆదేశాలు జారీచేశాం. సమస్యలు ఉన్న పాఠశాలలపై ఫిర్యాదు చేస్తే తక్షణమే సీజ్ చేస్తాం. అనుమతులు లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించొద్దు.

-దుర్గాప్రసాద్, డీఈవో, నిజామాబాద్

**కఠిన చర్యలు తీసుకుంటాం..**



జిల్లాలో అనుమతులు ఉన్న ఇంటర్ కళాశాలలు మాత్రమే అడ్మిషన్లు తీసుకోవాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. తోకపేర్లతో వివిధ కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకోవద్దు. కార్పొరేట్ కళాశాలలకు అనుమతులు రాలేదు. అనుమతులు వచ్చిన తర్వాతే అడ్మిషన్లు తీసుకోవాలి.

- రవికుమార్, జిల్లా ఇంటర్ విద్యా అధికారి, నిజామాబాద్

## బాలికపై లైంగికదాడి కేసులో ఒకరి రిమాండ్



భీమ్‌గల్, మే 27: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(13)పై లైంగికదాడి కేసులో ఓ నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని 14రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. ఎస్సై కథనం మేరకు.. ఈ నెల 25న రాత్రి ఇంటి వద్ద ఉన్న బాలికను అదే గ్రామానికి చెందిన చాంద్‌పాషా(35) తన బైక్‌పై ఎక్కించుకొని బయటికి తీసుకెళ్లాడు. బాలికను నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. బాలిక కుటుంబ సభ్యులు ఈనెల 26న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు చాంద్‌పాషాను రిమాండ్‌కు తరలించారు.

**చాక్లెట్ ఆశచూపి..**
**ఆరేండ్ల బాలికపై లైంగికదాడికి యత్నం**

మోపాల్(ఖలీల్‌వాడి ) మే 27: నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని ఓ గ్రామంలో యువకుడు చాక్లెట్ ఆశచూపి ఆరేండ్ల బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోపాల్ మండలంలోని ఓ గ్రామంలో పక్కింట్లో ఉంటున్న యువకుడు బయట ఆడుకుంటున్న ఆరేండ్ల బాలికకు చాక్లెట్ ఇస్తానని చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లాడు. అనంతరం లైంగిక దాడికి యత్నించగా బాలిక కేకలు వేయడంతో బాలిక చిన్నమ్మ చూసి గట్టిగా అరిచింది. దీంతో యువకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఆగ్రహించిన బాలిక తల్లిదండ్రులు నిందితుడి ఇంటిపై దాడి చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

## ‘డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేస్తుండు’

**కాంగ్రెస్ మండల అధ్యక్షుడిపై మెనూర్ పశువైద్యాధికారి ఆరోపణ**



డాక్టర్ విజయ్‌కుమార్

మద్నూర్, మే 27: తమ పార్టీ అధికారంలో ఉన్నదంటూ, తమను ఎవరేం చేయలేరనే ధీమాతో మద్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దరాస్ సాయిలు డబ్బుల కోసం బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడని మెనూర్ పశువైద్యాధికారి విజయ్‌కుమార్ ఆరోపించారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని రోజులుగా దరాస్ సాయిలు డబ్బులు ఇవ్వాలని తనను డిమాండ్ చేస్తూ వేధిస్తున్నాడని తెలిపారు. సక్రమంగా విధులు నిర్వర్తిస్తూ, ఎలాంటి తప్పుచేయని తాను డబ్బులు ఎందుకు ఇవ్వాలని సాయిలును ప్రశ్నించానని, దీంతో కక్షగట్టి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు తప్పుడు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు తాను మద్నూర్ గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారిగా ఉండడంతో ఎమ్మెల్యేతో కలిసి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొన్నానని తెలిపారు. ఇటీవల తనకు హార్ట్ ఎటాక్ రావడంతో దవాఖానలో చికిత్స పొంది డిశ్చార్జ్ అయ్యానని తెలిపారు. కొందరు రాజకీయ నాయకులు తనను పరామర్శించారని, వాటికి సంబంధించిన ఫొటోలు జోడించి ఫిర్యాదు చేశారన్నారు. తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని, తనపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న దరాస్ సాయిలు ఇకనైనా తనను వేధించడం మానుకోవాలని కోరారు.

## రైతులు సంయమనం పాటించాలి

**-డీఏవో భాగ్యలక్ష్మి**

కామారెడ్డి రూరల్, మే 27: రైతులు సంయమనం పాటించాలని విత్తనాల కోసం ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టామని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి భాగ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో సోమవారం పీఏసీఎస్ ద్వారా రైతులకు 833 బస్తాల జీలుగ, 282 బస్తాల జనుము విత్తనాలను విక్రయించామని పేర్కొన్నారు. విత్తనాలను సోమవారం విక్రయిస్తామనే సమాచారాన్ని ఏఈవోల ద్వారా కామారెడ్డి మండలంలోని రైతులకు సమాచారం అందించామని పేర్కొన్నారు. దీంతో రైతులందరూ ఉదయమే పీఏసీఎస్‌కు చేరుకొని విత్తనాల కోసం వరుసలో నిలబడ్డారని తెలిపారు. ఆన్‌లైన్‌లో పర్మిట్, బిల్లు జనరేట్ చేసేందుకు కొంత సమయం పట్టడంతో రైతులు లైన్‌లో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

## వ్యాపారులకు పర్మిషన్ ఇస్తారు.. మాకు ఇవ్వరా?

**సాలూరా తహసీల్దార్ రమేశ్‌తో రైతుల వాగ్వాదం**

బోధన్ రూరల్, మే 27 : సాలూరా మండల కేంద్రంలోని చెరువుకట్టపై దారికి మొరం పర్మిషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక రైతులు సోమవారం తహసీల్దార్ రమేశ్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అనుమతి కోసం తహసీల్దార్ రమేశ్‌తో వాగ్వాదానికి దిగారు. అనంతరం రైతులు మాట్లాడుతూ ఇసుక, మొరం వ్యాపారులకు అనుమతులు ఇస్తారు కానీ, రైతులకు మాత్రం ఇవ్వారా అంటూ తహసీల్దార్‌ను నిలదీశారు. రైతు పంట భూమి లో నుంచి మొరం తవ్వుకొని చెరువుకట్టపై దారి వేసుకుంటామని, లేదంటే రైతుల ప్రాణాలు గాల్లో కలుస్తాయని దీనికి ప్రభు త్వ అధికారులు బాధ్యత వహించాలన్నా రు. అక్రమ ఇసుక, మొరం వ్యాపార, దళారులకు అండగా ఉంటూ రైతులకు మాత్రం అడ్డు చెబుతున్నారని తహసీల్దార్‌పై మండిపడ్డారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమేశ్ మాట్లాడుతూ బోధన్ ఆర్డీవో పర్మిషన్ లెటర్ తేవాలని రైతులకు సూచించారు. రైతులు ఇల్తామ్ గంగయ్య, లింగయ్య, మట్టెం ప్రకాశ్, బుద్దె లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ రమేశ్‌తో రైతుల వాగ్వాదం

## కారు ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

- పోలీసు వాహనంలో దవాఖానకు తరలింపు
- మానవత్వం చాటిన ట్రైనీ ఐపీఎస్

వినాయక్‌నగర్, మే 27: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఓ మహిళను అటుగా వెళ్తున్న ట్రైనీ ఐపీఎస్ చైతన్యారెడ్డి తన వాహనంలో చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించి మానవత్వం చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ నగరంలోని చంద్రశేఖర్ కాలనీ చౌరస్తా వద్ద కొత్త కలెక్టరేట్ వైపు స్కూటీపై వెళ్తున్న మహిళను అటుగా వచ్చిన కారు ఢీ కొట్టింది. దీంతో స్కూటీ నడుపుతున్న మహిళ ఎగిరి కారు అద్దంపై పడింది. కారు నడిపిన వ్యక్తిని స్థానికులు పట్టుకొని చితకబాదడానికి యత్నించగా అప్పటికే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. అదే సమయంలో రూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి పోలీసు వాహనంలో వెళ్తున్న ట్రైనీ ఐపీఎస్ చైతన్యారెడ్డి ప్రమాదాన్ని గమనించి వెంటనే అక్కడికి చేరుకున్నారు. గాయాలపాలైన మహిళను తన పోలీస్ వాహనంలో ఎక్కించుకొని చికిత్స నిమిత్తం దవాఖానకు తీసుకెళ్లారు. కారు నడుపుతూ ప్రమాదానికి కారణమైన వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మహిళను దవాఖానకు తరలిస్తున్న ట్రైనీ ఐపీఎస్







**పహారా నడుమ పంపిణీ**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని పీఏసీఎస్‌కు సోమవారం రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జీలుగ, జనుము విత్తనాలు పంపిణీ చేస్తుండడంతో ఉదయమే కేంద్రానికి చేరుకొని క్యూలో నిల్చున్నారు. అధికారులు వచ్చిన అనంతరం పోలీసు పహారా మధ్య విత్తనాల బస్తాలను పంపిణీ చేశారు. ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యంతో తక్కువ సంఖ్యలో విత్తన బస్తాలు వచ్చాయని, బీఆర్ఎస్ హయాంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు పంపిణీ చేసినట్లు రైతులు గుర్తుచేసుకున్నారు.